పశుగణన పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 26 : అఖిల భారత పశుగణన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వి.కృష్ణ, వివిధ మండలాల పశు వైద్యాధికారులు శ్రీకాంత్, శివరామకృష్ణ, సంతోష్, అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం పశుగణన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశుగణన సర్వే నాలుగు నెలల పాటు ఉంటుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. శిక్షణ పొందిన 130 మంది ఎన్యూమరేటర్లు జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, 17 మండలాల్లోని 421 గ్రామపంచాయతీలు, ఆవాసాలు అన్నింటిలోనూ పశుగణన చేపడుతారన్నారు. ఇంటింటికీ తిరిగి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, ఎద్దులు, కుక్కలు, బాతులు, కోళ్లు, గాడిదలు, గుర్రాలు మొదలైన వాటి సంఖ్య, వివరాలు సేకరించి, మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని చెప్పారు. తమ వద్దకు వచ్చిన ఎన్యూమరేటర్లకు పశు పోషకులు సహకరించి, పశువుల వివరాలను తెలియజేయాలని సూచించారు.

రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

- ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్

వీరవెల్లిలో కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ విద్యాలయ విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 26 : రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వీరవెల్లి గ్రామంలో కంది, వరి, పత్తి పంటలను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పూత దశలో ఉన్న కందిని మారుక మచ్చల పురుగు ఆశించిందని, లద్దె పురుగులు ఆకులను, పువ్వులను కలిపి గూళ్లుగా చేసి మొగ్గలను తింటూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని అన్నారు. మారుక మచ్చల పురుగు నివారణకు ఎకరాకు 150 మిల్లీలీటర్ల నొవల్యురాన్, 400 మి.లీ. ప్రొఫినోఫాస్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో పండాకు తెగులుతో ఆకులు ఎర్రబడి, ఎండి రాలిపోతున్నాయని తెలిపారు. దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 10 గ్రాముల యూరియా చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో కాటుక తెగులు ఆశించిడం వల్ల కంకిలో పసుపు రంగు గింజలు ఏర్పడుతున్నాయని, ఈ తెగులు నివారణకు ఎకరానికి 200 మి.లీ. ప్రొఫికోనజోల్, 200 గ్రాముల కార్బెండిజమ్ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఇక్రిసాట్ శాస్త్రవేత్తలు శుభమ్, బాలరాజు, హైదరాబాద్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శ్యామలారాణి, అంజలి, భవాని, పూజ, ప్రీతి అభ్యుదయ రైతులు కంచి మల్లయ్య, బుగ్గా వెంకటేశ్, యల్లారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

మోత్కూరు, అక్టోబర్ 26 : ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను, వ్యాక్సిన్ గదిని పరిశీలించారు. వ్యాక్సినేషన్‌పై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది పనితీరుపై పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాక్సినేషన్‌ను రోజు వారీగా రికార్డుల్లో పొందుపర్చాలని సూచించారు. సిబ్బంది పనితీరుపై వైద్యాధికారి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హేమంత్‌కుమార్, అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథలకు సేవ చేయడం అలవర్చుకోవాలి : ఏసీపీ

సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

చౌటుప్పల్, అక్టోబర్ 26 : అనాథలకు సేవ చేయడం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని ఏసీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అమ్మానాన్న అనాథాశ్రమంలోని 600మంది మానసిక దివ్యాంగులకు హైదరాబాద్‌కు చెందిన మదర్ థెరిస్సా సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.4లక్షల విలువైన నిత్యావసరాలు, దుస్తులు, దుప్పట్లు, గ్రీజర్లు, ఫ్యాన్లను శనివారం ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సమాజంలో మానసిక దివ్యాంగులు ఆదరణ లేక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారి ఆకలి బాధ తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ మన్మథకుమార్, సొసైటీ అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి ఎలీషా, డైరెక్టర్లు సుధీర్, సామాజిక కార్యకర్తలు పర్నె శివారెడ్డి, సుక్క సుదర్శన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తుర్కపల్లి : దత్తాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్య

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 26 : మండల కేంద్రంతోపాటు మొరిపిరాల, సర్వేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. ఏపీఎం కిరణ్, సీసీలు వెంకన్న, భాస్కర్, నాయకులు, రైతులు, సంఘబంధం సభ్యులు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండలంలోని మాదాపురం, వెంకటాపురం, దత్తాయిపల్లి, ఇబ్రహీంపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్య శనివారం ప్రారంభించిమాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ దేశియానాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదార్‌గౌడ్, డైరెక్టర్ పట్టునాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్‌నాయక్, మోహన్ బాబు, శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పంతంగి, అంకిరెడ్డిగూడెం, గుండ్లబావి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఏఓ నాగరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, డైరెక్టర్లు సాయిలు, పద్మ, నాయకులు సంజీవరెడ్డి, మల్లేశం, సత్యం పాల్గొన్నారు.

వైభవంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణం

స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమంలో భాగంగా ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతు సాగింది. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి నిత్య కల్యాణ తంతు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.23,64,238 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సేవలో కేంద్ర ఆదాయ పన్నుల శాఖ ధర్యాప్తు విభాగం డీజీ ఆనంద్ రాజేశ్వరి బైవారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ వేర్వేరుగా పాల్గొని తరించారు. శనివారం ఉదయం స్వామివారి కొండపైకి చేరుకున్న వారికి అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. గర్భాలయంలోకి ప్రవేశించి స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు మహాప్రసాదం అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎన్నికల హామీలు అమలను చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

ఆలేరు రూరల్, అక్టోబర్ 26 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని గుండ్లగూడెంలో శనివారం జరిగిన పార్టీ మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ఓట్లు వేయించుకొని గద్దెనెక్కాక వాటిని అమలు చేయడం లేదన్నారు. హామీలు అమలు చేయకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయికి చేరకముందే మేలుకొని హామీల అమలుకు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. జమిలి ఎన్నికల పేరుతో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాష్ట్రాల హక్కులను హరిస్తున్నదని పేర్కొన్నారు. మహాసభలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాటూరి బాలరాజుగౌడ్, మండల కార్యదర్శి దూపటి వెంకటేశ్, నాయకులు సుదగాని సత్యరాజయ్య, మంగ నర్సింహులు, ఈరపల్లి ముత్యాలు, నలమాస తులసయ్య, జూకంటి పౌల్, నూతి సక్కుబాయి, మణెమ్మ, గణేశ్, శంకర్, శంకరయ్య పాల్గొన్నారు.

సీపీఎం భువనగిరి మండల కార్యదర్శిగా అంజయ్య

పల్లెర్ల అంజయ్య

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 26 : సీపీఎం భువనగిరి మండల కార్యదర్శిగా పల్లెర్ల అంజయ్య ఎన్నికయ్యారు. మండలంలోని వడపర్తిలో శనివారం నిర్వహించిన పార్టీ మండల 8వ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా దయ్యాల నర్సింహ, ఎదునూరి మల్లేశం, అన్నంపట్ల కృష్ణ, కొండా అశోక్, కొండమడుగు నాగమణితోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలన్నారు. ముంపునకు గురవుతున్న తిమ్మాపురం గ్రామ ప్రజలందరికీ నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య సంఘం వలిగొండ మండలాధ్యక్షుడిగా నాగేశ్వర్‌గుప్తా

నాగేశ్వర్‌గుప్తా

వలిగొండ, అక్టోబర్ 26 : ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా బెలిద నాగేశ్వర్‌గుప్తా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గోరంటి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా అప్పిశెట్టి సంతోష్, కోశాధికారిగా గజ్జెల అమరేందర్, పట్టణ అధ్యక్షుడిగా డోగిపర్తి సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారంతోపాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంతోష్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్వర్లు, అశోక్, లక్ష్మీనర్సయ్య, నర్సయ్య, నాగరాజు, కిష్టయ్య పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీ దొంగల అరెస్ట్

వలిగొండ, అక్టోబర్ 26 : ట్రాక్టర్ బ్యాటరీలను దొంగతనం చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని నాగారం గ్రామం వై జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఓ కారులో మూడు బ్యాటరీలు, పానాలు, కట్టర్ గుర్తించారు. దాంతో కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా పార్కు చేసిన ట్రాక్టర్, లారీల బ్యాటరీలను రాత్రి వేళల్లో దొంగిలిస్తున్నట్లు అంగీకరించారు. వలిగొండ, ఆత్మకూర్(ఎం), మోత్కూర్, నారాయణపురం మండలాల్లో 10 దొంగతనాలు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి లక్షా 35వేల నగదుతోపాటు మూడు ఎక్సైడ్ బ్యాటరీలు, మారుతీ స్విఫ్ట్ కారు, పానాలు, కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త చేరిక

అంజనేయులుకు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 26 : మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బరిగె ఆంజనేయులు బీఆర్ఎస్‌లో చేరారు. యాదగిరిగుట్టలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి శనివారం ఆయనకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు, పార్టీ కార్యకర్తలకు నమ్మకం పోయిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, యువజన విభాగం నాయకుడు మల్లేశ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని ధర్నా

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

చౌటుప్పల్, అక్టోబర్ 26 : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ శ్రీనివాస్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ప్రైవేటు కళాశాలలు బంద్ చేసే పరిస్థితి నెలకొన్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, నాయకులు తీగుళ్ల శ్రీనివాస్, జగన్‌నాయక్, ప్రకాశ్, మధు, రామ్, నందు, విక్రమ్, అఖిల, అక్షయ. నందీశ్వర్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అనంతరెడ్డి

మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అనంతరెడ్డి

ఆలేరు టౌన్, అక్టోబర్ 26 : దేశ వ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి అనంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలేరులో శనివారం జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర రాక, ఉత్పాదక వ్యయం పెరిగి అప్పులపాలై రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో కౌలు కట్టలేక, శ్రమ ఫలితం మిగలక కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దొడ్డిదారిన కార్పొరేట్ రంగంగా మార్చే కుట్ర చేస్తుందని విమర్శించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెన్నె మల్లేశ్, కార్యదర్శిగా వస్సరి బాలమల్లేశ్, కోశాధికారిగా కొత్తపేట చంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా బొడ్డు అబ్బయ్య, కడకంచి రాజయ్య, రవి ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు పంగ రవి, పంగ సరిత, పంగ నాగరాజు, అంగడి కరుణాకర్, బూడిద శ్రవణ్, తుంగ శ్రవణ్ పాల్గొన్నారు.

కొత్త హాస్టళ్లు ఏర్పాటు చేయాలి : బీసీ విద్యార్థి సంఘం

బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్యకు వినతి పత్రం ఇస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 26 : జిల్లా కేంద్రంతోపాటు చుట్టూ ఉన్న మండలాల్లో కొత్త బీసీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాం దేవ్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్యకు శనివారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు పెరుగడంతో ఇప్పుడున్న హాస్టళ్లు సరిపోవడం లేదన్నారు. రామన్నపేట, చౌటుప్పల్, ఆలేరు, మోత్కూరు, వలిగొండ, బొమ్మలరామారం మండల కేంద్రాల్లో అవసరాన్ని బట్టి హాస్టళ్లు పెంచాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు వేముల అనిల్, భూక్యా సంతోష్‌నాయక్, గుండెబోయిన శంకర్ ఉన్నారు.

భూదాన్ పోచంపల్లి : ప్రజా చైతన్య యాత్రలో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు

మూసీ ప్రక్షాళనకు సహకరించాలి

- ఎంపీ చామల, ఎమ్మెల్యేలు కుంభం, వేముల

భూదాన్ పోచంపల్లి/ బీబీనగర్, అక్టోబర్ 26 : మూసీ నది ప్రక్షాళన కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం కోరారు. భూదాన్ పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామం నుంచి బీబీనగర్ మండలం మక్తానంతారం మూసీ వంతెన వరకు శనివారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మూసీ పరీవాహక ప్రాంత రైతులు, వృత్తిదారులు, ప్రజలకు మూసీ ప్రక్షాళనపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లాల ప్రజల మురికి నీటి కష్టాలు తీరుతాయన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు అందెం సంజీవరెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పాక మల్లేశ్‌యాదవ్, భారత లవకుమార్, రాష్ట్ర నాయకులు గోలి పింగళ్‌రెడ్డి, రామాంజనేయులు గౌడ్, వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాన్ని గౌరవించాలి

- అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ఒప్పుకొనే బిలేదు : ఎమ్మెల్యే వీరేశం



కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 26 : ప్రజల అభిప్రాయాన్ని గౌరవించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులతో కలిసి శనివారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 23న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటును ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారన్నారు. ప్రజలకు హాని కలిగించే సిమెంట్ పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని పేర్కొన్నారు. సిమెంట్ కంపెనీ ఏర్పాటు వల్ల రైతులతోపాటు వివిధ వృత్తులవారు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. సిమెంట్ కంపెనీ ప్రతిపాదిత ప్రాంతం నుంచి ధర్మారెడ్డిపల్లి కాల్వ పోతుందని, పరిశ్రమ ఏర్పాటు చేస్తే సాగు భూములు బీడుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ప్రజల అభిప్రాయాల ప్రతులను ఇవ్వాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో రామన్నపేట పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు మేక అశోక్‌రెడ్డి, జినుకల ప్రభాకర్, జెల్లెల పెంటయ్య, మహ్మద్ రేహాన్, పల్లపు దుర్గయ్య, ఉట్కూరి నర్సింహ, ఫజల్ బేగ్, బాలకిషన్, జమీరుద్దీన్, అక్రం, హనుమంతు, రాంరెడ్డి, శ్రవణ్‌కుమార్, ఆనంద్, శివ, శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సీపీఎం గ్రామ మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 26 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు